నేడు నర్సింగ్ కళాశాల ప్రారంభం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 1: జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సోమవారం ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ ఒక ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా ప్రజాపాలన – ప్రజా విజయోత్సవ వేడుకల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గండి కల్యాణ్(ఫైల్)

లింగాలఘనపురం, డిసెంబర్ 1: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గండి కల్యాణ్(21) నవంబర్ 26న యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఉన్న స్నేహితుడి బర్త్ డే వేడుకలకు మరో స్నేహితుడితో కలిసి తన బైక్‌పై బయల్దేరాడు. భువనగిరిలో బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో తల, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తల్లిదండ్రులు రేణుక, అంజయ్య, అన్న, చెల్లె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఆర్, ఆర్‌అండ్‌బీ అధికారుల జాడ ఎక్కడ?

బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్

పాలకుర్తి, డిసెంబర్ 1: మండలంలోని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అధికారుల జాడ ఎక్కడ? అంటూ బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్ ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. ప్రభుత్వ అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నా పంచాయతీరాజ్ అధికారులు కనిపించడం లేదని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండాల్సిన అధికారులు అధికార పార్టీ నాయకుల దగ్గర ఉండడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు.

జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలి

పాలకుర్తి, డిసెంబర్ 1: జీఓ 317లోని నిబంధనలను సవరించి బాధితులకు న్యాయం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భార్యభర్తల ప్రాధాన్యం కేటగిరీల పరస్పర బదిలీలు మాత్రమే చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీఓ నంబర్ 243, 244, 245లను జారీ చేయడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 317జీఓను ఉప సంహరిస్తామని చెప్పిందని, జీఓ జారీ చేసి కాలం గడుస్తున్నా ఫలితం శూన్యమన్నారు. తక్షణమే 317 జీఓలో లోపాలను సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.

NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

రైతు రుణమాఫీపై గందరగోళం

- రూ.2లక్షల రుణమాఫీ లిస్ట్ ఇదేనంటూ వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేసిన కాంగ్రెస్ నాయకులు
- వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు పరుగెత్తిన పలువురు రైతులు
- పాత లిస్ట్ అని తేల్చిన అధికారులు

లింగాలఘనపురం, డిసెంబర్ 1: రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ క్యాడర్ గందరగోళానికి గురిచేయగా రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించగా వ్యవసాయశాఖ అధికారులు వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రూ.2క్షల రుణ మాఫీ అయిందని.. ఇదే లిస్ట్ అంటూ మండల కాంగ్రెస్ నాయకులు ఒకరి తర్వాత మరొకరు వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేశారు. రైతుల పేర్లు, బ్యాంకు ఖాతా నంబర్లతో ఉన్న ఓ పాత లిస్టును పోస్ట్‌లు చేశారు. ఆ లిస్ట్‌లో పేరు లేని రైతులు అన్ని అర్హతలున్నా తమకెందుకు రుణమాఫీ కాలేదని అయోమయానికి గురయ్యారు. వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్లి నిలదీస్తుండగా వారు తల పట్టుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. దాదాపు 60 నుంచి 70శాతం మందికి రుణ మాఫీ చేయగా ఇంకా కొందరికి రుణమాఫీ కావాల్సి ఉంది. ఈ విషయంపై కాంగ్రెస్ నాయకులు కొందరు నవంబర్ నెలాఖరులో మాఫీ అవుతాయని ప్రకటిస్తుండగా, మరి కొందరు సోనియమ్మ జన్మదినం డిసెంబర్ 9 వరకు అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. కాగా ప్రభుత్వం రుణ మాఫీ నిధులను విడుదల చేసిందని.. కొన్ని క్షణాల్లో రైతులకు బ్యాంకుల నుంచి శుభవార్త వస్తుందని నవంబర్ 28, 29 తేదీల్లో ప్రచారం చేశారు. కొన్ని గంటల తర్వాత రుణమాఫీ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని, అదే ఈ లిస్టు అంటూ వివిధ గ్రూపుల్లో కాంగ్రెస్ నాయకులు పోటీ పడి పలు వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేశారు. ఆ లిస్టులో పేర్లు లేని రైతులు వ్యవసాయశాఖ అధికారుల వద్దకు పరుగులు తీశారు. ఈ లిస్ట్ ఏంటి? అని వ్యవసాయశాఖ ఆరా తీయగా.. అది పాతదని తేలింది. దీంతో రుణమాఫీ నిధులు విడుదలైనట్లు అసలు తమకు సర్క్యులరే రాలేదని, వస్తే తామే స్వయంగా సమాచారం ఇస్తామని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ క్యాడర్ అత్యుత్సాహంతో రైతులను కలవరానికి గురిచేయగా, అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

గంతకు తగ్గ బొంత అంటే ఇదే..

సీఎం రేవంత్‌రెడ్డి మసిపూసి మారేడు కాయ చేస్తుంటే.. మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు గంతకు తగ్గ బొంతలా వ్యవహరిస్తున్నారు. పాత రుణమాఫీ లిస్టును వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేసి రూ.2లక్షల రుణమాఫీ అయిందంటూ తప్పుడు ప్రచారం చేశారు. ఆ లిస్టులో పేర్లులేని రైతులు కలవరానికి గురయ్యారు. అధికారులను నిలదీస్తుంటే.. వారు తలలు పట్టుకుంటున్నారు.

– ఏదునూరి వీరయ్య, రైతు, లింగాల ఘనపురం

నిధులు విడుదలైతే సమాచారం ఇస్తాం

రుణమాఫీపై రైతులు కలవరపడొద్దు. నిధులు విడుదల కాగానే మేమే రైతులకు సమాచారం ఇస్తాం. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సర్క్యులర్ జారీ కాలేదు. రైతులు సంయమనం పాటించాలి.

– వెంకటేశ్వర్లు, ఏవో

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

తెలంగాణ ఉద్యమకారుడు పృథ్వీరెడ్డి

మాట్లాడుతున్న పృథ్వీరెడ్డి

దేవరుప్పుల, డిసెంబర్ 1 : ములుగు జిల్లా అటవీ ప్రాంతం చల్పాకలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిపుణులైన డాక్టర్ల బృందంతో పోస్టుమార్టం చేయించి, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ ఉద్యమకారుడు ఇప్ప పృథ్వీరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు మావోయిస్టులకు భోజనంలో విషప్రయోగం చేసి, ఏడుగురుని పట్టుకుని కాల్చిచంపారనే అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. మావోయిస్టులపై ప్రభుత్వ వైఖరి, జరిగిన వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఏడాదిలో ఇది రెండో ఎన్‌కౌంటర్ అని, వీటిల్లో 13 మందిని హతమార్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత ఉందని తెలిపారు.

సోమ్లాకు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుతున్న రామోజీ

బీఆర్ఎస్ రామన్నగూడెం గ్రామ కమిటీ ఎన్నిక

కొడకండ్ల, డిసెంబర్ 1: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశానుసారం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిందె రామోజీ ఆధ్వర్యంలో మండలంలోని రామన్నగూడెంలో బీఆర్ఎస్ పార్టీ నూతన గ్రామ కమిటీ ఎన్నిక చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా కునుసోత్ సోమ్లు, ఉపాధ్యక్షుడిగా ఎశబోయిన కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా తీగల ఉపేందర్ ఎన్నికయ్యారు. పార్టీ గ్రామ ఇన్‌చార్జి కాటూరి కృష్ణమూర్తి, అనిల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ దేశగాని సతీష్, మాజీ సర్పంచ్ లింగయ్య, బి.శ్రీను, ఎల్లప్ప, రణధీర్ పాల్గొన్నారు.

2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్

ఆరోగ్యంపై దృష్టిసారించాలి

జనగామ చౌరస్తా, డిసెంబర్ 1: ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టిసారించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన–ప్రజా విజయోత్సవ వేడుకలు ఆదివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. తొలిరోజు జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు నుంచి కలెక్టరేట్ వరకు యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ చేపట్టారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, విశిష్ట అతిథిగా వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ హాజరై వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు వాకర్స్‌తో కలిసి 2కే రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రోజూ వ్యాయామం, రన్నింగ్, మెడిటేషన్ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, డీఏవో రామారావు నాయక్, బీసీ సంక్షేమశాఖ అధికారి రవిందర్, డీఈవో రమేశ్, ఏసీపీ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

తోట సురేందర్‌ను సన్మానిస్తున్న శివునిపల్లి గ్రామస్తులు

రాష్ట్ర స్థాయిలో పోటీల్లో విజేతకు సత్కారం

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 1 : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ట్రై సైకిల్ పోటీల్లో మండలంలోని శివునిపల్లికి చెందిన తోట సురేందర్ ద్వితీయ బహుమతి సాధించాడు. ఈమేరకు ఆదివారం మాజీ సర్పంచ్ కొంతం శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ తోట సత్యం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తోట వెంకటేశ్వర్లు, తోట లక్ష్మినారాయణ, తోట సోమయ్య, తోట చంద్రయ్య, తోట సోమేశ్వర్లు, తోట రమేశ్, గాండ్ల మహేందర్, తోట అఖిల్ పాల్గొన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి రూ.85వేలు చోరీ

జనగామ చౌరస్తా, డిసెంబర్ 1: పట్టణంలోని గుండ్లగడ్డ చిన్నమోరి వద్ద శనివారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కారుడ్రైవర్ ఎండీ యాకుబ్ కిరాయి ఇంట్లో నివసిస్తున్నాడు. జనగామలో కిరాయి ఇంటి సమీపంలో ఉన్న తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూసేందుకు యాకుబ్ భార్యతోపాటు మూడు రోజుల క్రితం వెళ్లి అక్కడే ఉన్నారు. ఈ క్రమంలో కిరాయి ఇంటి వద్ద ఎవరూ లేని సమయం చూసి గుర్తుతెలియని దుండగులు తాళం పగులకొట్టి చొరబడ్డారు. ఇంట్లో స్టీల్‌డబ్బాలో దాచుకున్న రూ.85వేల నగదుతోపాటు తులం బంగారం, చీరెల మూటను ఎత్తుకెళ్లారు. గతంలో హనుమకొండలో నివసించిన యాకుబ్ దంపతులు పది రోజుల క్రితమే జనగామలో ఇల్లు కిరాయి తీసుకొని నివసిస్తున్నారు. అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న మండల మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 1: మండలంలోని తాటికొండలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు మండల మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. ఆదివారం తాటికొండ శివారు జీబీ తండాకు చెందిన వాంకుడోత్ బిచ్చ, భూక్య మాన్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న సుధీర్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి, రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. తండాలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గుగులోత్ తారచంద్రు, రొయ్యల దుమయ్య, భూక్య భద్రు, రొయ్యల రవి, రొయ్యల రమేశ్, గుగులోత్ సమ్మన్న పాల్గొన్నారు.

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున

జనగామ చౌరస్తా, డిసెంబర్ 1: పునరుద్ధరించదగిన శక్తివనరులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పునరుత్పాదక శక్తి వనరుల అంశంపై మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ జమున, విశిష్ట అతిథిగా ఎంఈవో వంగాల రాజేందర్ హాజరయ్యారు. జమున మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అర్బన్, రూరల్ విభాగంలో ప్రథమ విజేతలుగా నిలిచిన ధర్మకంచ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎస్ వెంకటేశ్, గానుగు పహాడ్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి పొలాల హారికతోపాటు ప్రైవేట్ పాఠశాలల విభాగంలో గెలుపొందిన స్కాలర్స్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థి బీ హరిణికి బహుమతులు అందజేశారు. వార్డు కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్రగుప్తా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, శంకర్‌రెడ్డి, బాలరాజు, సత్తయ్య, కనకయ్య, వసంత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులతో నాటి గురువులు

జఫర్‌గఢ్, డిసెంబర్ 1 : మండలంలోని కూనూరు పాఠశాలలో 1986–1987 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. తమకు విద్య బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల గదులను తిరిగి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆపదలో ఉన్న తోటి స్నేహితులకు అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. బి.రాములు, ఈ.కృష్ణమూర్తి, కే కొండల్‌రెడ్డి, పసునూరి మహేందర్‌రెడ్డి, పి.సంపత్‌రెడ్డి, కే.కృష్ణమూర్తి, చిరంజీవి, రామరాజు, రవీందర్, ఎస్.ప్రభాకర్, జి.రాంచందర్, సదానందం, వెంకట్రాజం, డా.సోమయ్య, పి.రాజిరెడ్డి, పి.లలిత, పారిజాత, కిషన్‌రావు, అమర్నాథ్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

నినాదాలు చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

బచ్చన్నపేట, డిసెంబర్ 1 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పంగ రవి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. విద్యా పరిరక్షణ కోసం విద్యార్థులు ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో బచ్చన్నపేట మండల కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా అజయ్, కార్యదర్శిగా నితిన్, కోశాధికారిగా బన్నీ, కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్, సాగర్, అజయ్, వివేక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

రఘునాథపల్లి, డిసెంబర్ 1: మండలంలోని నిడిగొండ సెయింట్ పీటర్స్ ఫౌండేషన్ హైస్కూల్‌లో ఆదివారం జిల్లాస్థాయి మహిళా సీనియర్స్ కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈమేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వై కుమార్‌గౌడ్ వెల్లడించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 7 నుంచి 10 వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆతర్వాత హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. తోటకూరి గట్టయ్య, ఏదునూరి ఉప్పలయ్య, సుధాకర్, కుమార్, నూకల రాజయ్య, చందర్, రాజు, అనిత, రేణుక, సురేష్, సాంబరాజు పాల్గొన్నారు.

లిబరేషన్ పార్టీ జనసభను విజయవంతం చేయండి

కొడకండ్ల, డిసెంబర్ 1: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 6న వరంగల్‌లో నిర్వహించే సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జనసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జనసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు. ఆదాయ మార్గాలపై ఉన్న శ్రద్ధ ప్రజల అభ్యున్నతిపై లేదన్నారు. జిల్లా నాయకులు జేడి సోమయ్య, కొన్కటి కళింగరాజు, గాయాల బాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి జంగటి కైలాసం

లింగాలఘనపురం, డిసెంబర్ 1: తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వరంగల్, నల్గొండ, ఖమ్మం నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి జంగటి కైలాసం అన్నారు. నెల్లుట్ల శ్రీనివాసనగర్ కాలనీలో టీయూటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నెల్లుట్ల రవీందర్‌రావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీయూటీఎఫ్‌తోపాటు పలు తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తనకు మద్దతు తెలుపుతున్నాయని పేర్కొన్నారు. పీఆర్‌సీ, డీఏల మంజూరు బకాయిల చెల్లింపుల విషయం పోరాడటంతోపాటు పాఠశాలల విద్య పటిష్టత కోసం, ఉపాధ్యాయ ఖాళీల భర్తీకోసం పోరాడుతానన్నారు. నెల్లుట్ల రవీందర్‌రావు, రమేశ్, ఆర్ వెంకటేశ్వర్లు, గణేశ్, ఈర్యా, వెంకటేశ్వర్‌రావు, శంకర్, గోవర్ధన్‌రావు, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

టైల్స్ కార్మిక సంఘం కార్యవర్గం ఎన్నిక

బచ్చన్నపేట మండల టైల్స్ కార్మికుల యూనియన్ కార్యవర్గ సభ్యులు

బచ్చన్నపేట, డిసెంబర్ 1 : మండల టైల్స్ కార్మికుల యూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎలిపెద్ది రమేశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా గందమల్ల కిష్టయ్య, ఉపాధ్యక్షుడిగా మేకల మల్లేశ్, కార్యదర్శిగా గొట్టె ఆంజనేయులు, కోశాధికారిగా కర్రె పర్వతాలు, సలహాదారులుగా చంద్రమౌళి, కనుకయ్య, శ్రీకాంత్, తిరుపతి, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

దేవరుప్పుల, డిసెంబర్ 1 : మండలంలోని బోడబండ తండాలో పోలీసులు గుడుం బా స్థావరాలపై దాడులు చేశా రు. ఆదివారం సమాచారం రావడంతో తండాకు చెందిన భూక్యా మల్లేశ్, బుజ్జి దంపతులు గుడుంబా తయారు చేస్తున్నట్లు తెలియడంతో స్థావరాలపై దాడులు చేశారు. నాలుగు లీటర్ల గుడుంబా, 15 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో కానిస్టేబుళ్లు యాకేశ్, మసూద్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు మండల యువజన ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్

శ్రీకాంత్

పాలకుర్తి, డిసెంబర్ 1: మున్నూరుకాపు సంఘం మండల యువజన ఉపాధ్యక్షుడిగా మండలంలోని వల్మిడికి చెందిన వీరమల్ల శ్రీకాంత్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి తెలిపారు. ఆదివారం ఆయనకు నియామక ఉత్తర్వుల పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్ల రాజు, మండల అధ్యక్షుడు కొండపల్లి కుమారస్వామి, నాసం సురేశ్, కడారి యాకేశ్, వీరమల్ల వెంకన్న, రాగం కొంరెల్లికి ధన్యవాదాలు తెలిపారు.

బీసీ హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలి

పాలకుర్తిలోని బీసీ హాస్టల్‌ను విజిట్ చేసిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

పాలకుర్తి, డిసెంబర్ 1: బీసీ హాస్టల్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు బానోత్ మహేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నానపు గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించడం తెలిపారు. చలి కాలంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు లకావత్ సురేశ్, వెంకట్, నాగరాజు, భూక్య మహేందర్, లావుడ్యా ఈశోక్‌నాయక్ ఉన్నారు.

సిద్ధేశ్వరాలయంలో కార్తీక పూజలు

సిద్ధేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బచ్చన్నపేట, డిసెంబర్ 1 : కార్తీకమాసం ఆఖరి రోజు పురస్కరించుకుని భక్తులు మండలంలోని కొడవటూరు శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా పూజలు చేశారు. గుట్టపై ఉన్న గుండాల్లో స్నానాలు ఆచరించి కొండ సొరికెల్లో కొలువుదీరిన స్వామివారికి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ఓం నమశ్శివాయ, అర్చకులు సదాశివుడు, మహాశివుడు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయస్వామి ఆలయంలో పూజారి గణపురం ఆనంద్‌స్వామి ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. పద్మశాలి కులబాంధవులు, ఇతరులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. గంగం భానుప్రకాశ్‌రెడ్డి, నూకల లక్ష్మికాంత్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

దేవరుప్పుల: గన్‌పార్కు వద్ద కిష్టయ్యకు నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ ఐక్య వేదిక నేతలు

పాలకుర్తి: పోలీస్ కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు

దేవరుప్పుల, డిసెంబర్ 1 : పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతి సందర్భంగా గన్‌పార్కు వద్ద ముదిరాజ్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. ముదిరాజ్ ఐక్య వేదిక కన్వీనర్, దేవరుప్పుల మండలం చిన్నమాడూరుకు చెందిన గొడుగు మల్లికార్జున్, బోనగిరి జిల్లా అధ్యక్షుడు కొలుపుల హరినాథ్, ముదిరాజ్ రాష్ట్ర నాయకుడు నల్ల సోమమల్లయ్య పాల్గొని మాట్లాడారు. కిష్టయ్య సేవలను ప్రతి తెలంగాణ బిడ్డ మరిచిపోవద్దన్నారు.

కిష్టయ్య జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే నిర్వహించాలి

పాలకుర్తి : తెలంగాణ ఉద్యమ అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి, జయంతిలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని విశ్రాంత సైనికుడు, ప్రముఖ వైద్యుడు కల్నల్ మాచర్ల భిక్షపతి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ అమరవీరుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఉద్యమ సమయంలో పోలీస్ కిష్టయ్య 'జై తెలంగాణ' అంటూ పిస్తోల్‌తో కాల్చుకుని అమరుడయ్యాడని తెలిపారు. ఆయన విగ్రహాన్ని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు కిష్టయ్య ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కోరారు. ముదిరాజ్ మహా సభ జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం, చిక్కుడు రాములు, మాచర్ల ఎల్లయ్య, గొరంతల ఎల్లస్వామి, దాసరి మధు, నీరటి సోమయ్య, మామిండ్ల శోభన్‌బాబు, బీ నరేశ్, రేగుల సోమయ్య, సాయి, రేగుల సోమయ్య పాల్గొన్నారు.

కిష్టయ్య త్యాగం చిరస్మరణీయం

రఘునాథపల్లి: తెలంగాణ ఉద్యమంలో పోలీస్ కిష్టయ్య త్యాగం చిరస్మరణీయమని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు నీల ఆగయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సమావేశంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ముప్పిడి మల్లేశ్, మడికంటి మధు మాట్లాడుతూ కిష్టయ్య ఆశసాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. దుస్సా పరశురాములు, మొగిలి భిక్షపతి, బోయిని క్రిష్ణ, దాసరి సాయి, పిట్టల ఎల్లయ్య, కట్ట రాజేశ్, పుట్టల విష్ణు, వెంకన్న పాల్గొన్నారు.

శివునిపల్లిలో..

స్టేషన్ ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లిలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ బూర్ల శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం పోలీస్ కిష్టయ్య తెలంగాణ గడ్డమీద చేసిన మహోన్నత త్యాగం ఫలించిందన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువజన కార్యదర్శి గోరంట్ల యాదగిరి, చెన్నూరి వెంకటేశ్వర్లు, కొండ వేణు, చిక్కుడు రమేశ్, సంకెండ్ల రవి, శాగ సురేష్ పాల్గొన్నారు.

టీబీఎన్‌కేఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

రాములు, టీబీఎన్‌కేఎస్ గ్రామ అధ్యక్షుడు

రఘునాథపల్లి, డిసెంబర్ 1: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (టీబీఎన్‌కేఎస్) మండలంలోని ఖిలాషాపురం గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పానుగంటి రాములు, ప్రధాన కార్యదర్శిగా తాడూరి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా కందికొండ రాజు, ప్రచార కార్యదర్శులుగా తాడూరి నాగరాజు, తాడూరి సత్తయ్య, రాము, బాలనర్సు, యాదగిర, యాదగిరి, కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.